క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్‌ఐకి విరాళం అందజేస్తున్న మహేశ్

కడ్తాల్: తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏదుల మహేశ్, సమాజ సేవలో భాగంగా నిఘా నేత్రాల ఏర్పాటుకు తన వంతు సాయం అందించాడు. శనివారం ఆయన తలకొండపల్లి ఠాణాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్‌కు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.10 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ ట్రస్ట్ సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌కు చెందిన సాలమ్మ, న్యామతాపూర్‌కు చెందిన లక్ష్మయ్య, పుల్లేరుబోడ్‌తండాకు చెందిన దేవుజా ఇటీవల వివిధ అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. బాధిత కుటుంబాలను శనివారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ పరామర్శించారు. ఈసందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మూడు కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు గోపాల్, రమేశ్, వసంత, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు లాయక్‌అలీ, కృష్ణయ్య, రాములు తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

కడ్తాల్: తలకొండపల్లి మండలం కోరింతకుంట తండాకు చెందిన కేతావత్ రూప్‌సింగ్ ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ శనివారం ట్రస్ట్ నుంచి సిమెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రవీందర్, నాయకులు నరేశ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

క్రైస్తవులకు అండగా కాంగ్రెస్

పార్టీ జిల్లా నాయకుడు
ఈసీ శేఖర్‌గౌడ్



శ్మశానంలో ప్రహరీ పనులు ప్రారంభిస్తున్న ఈసీ శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందని పార్టీ జిల్లా నాయకుడు, ఆదిబట్ల మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్ అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ కేంద్రంలోని మరియపురంలో మరియరాణి చర్చి సమాధులకు ప్రహరీ పనులు ఈసీ శేఖర్‌గౌడ్, ఆంథోని ఫాదర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, పల్లె రజినికాంత్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పల్లె శ్రీనివాస్‌గౌడ్, అరుణ్, శూరి జయరాజ్, విజయలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరమని ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎంపీ పటేల్‌గూడకు చెందిన సాహెబ్‌గూడ బాచయ్య అనారోగ్యానికి గురి కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సిఫారసు చేయగా రూ.37వేలు చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శనివారం నిరంజన్‌రెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. పార్టీ నాయకులు సంరెడ్డి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

మీర్‌పేట: బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ భిక్షపతిచారి జన్మదినం సందర్భంగా సిర్లాహిల్స్ ప్రభుత్వ విద్యార్థులకు శనివారం ఆయన నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం భిక్షపతిచారి పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు అందజేశారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- 2,790 స్వయం సహాయక సంఘాలకు రూ.2.29 కోట్ల వడ్డీలేని రుణం అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు

కడ్తాల్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని.. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్‌లో కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2,790 స్వయం సహాయక సంఘాలకు రూ.2.29 కోట్ల వడ్డీలేని రుణానికి సంబంధించిన చెక్కును, డీఆర్‌డీఓ పీడీ శ్రీలత, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీతతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ రూ.7 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిపోయిందని.. ఇందుకు ప్రతీ నెల రూ.6,500 కోట్ల వడ్డీని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తూనే, హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని.. మిగిలిన అర్హులకు సైతం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. నూతనంగా రేషన్ కార్డులతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరు మీద పాఠశాలల అభివృద్ధి బాధ్యత మహిళలకే అప్పగించిందన్నారు. నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలంలో రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాలుగు మండలాల్లో మండల మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డీఆర్‌డీఓ పీడీ శ్రీలత మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తికి భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు. జిల్లాలో ఎస్‌హెచ్‌జీ ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించడంలో ముందున్నామని, 99.94% రీ పేమేంట్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సభ్యులకు మంజూరైన ప్రమాదబీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బట్టు కిషన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్య, విజయ్, కృష్ణనాయక్, వెంకటేశ్, శ్రీశైలం, దశరథ, ఆయా మండలాల ఐకేపీ అధ్యక్షులు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాసు శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

చుక్కాపూర్‌లో పర్యటన

శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా తనకు 9వ తరగతిలో చదువు చెప్పిన విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యప్రకాశ్‌ను కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, బాబా, యాదయ్య తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

కడ్తాల్: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో సీహెచ్ఎస్24 ఎమ్ఎఫ్ జొన్న వెరైటీ రకం పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల పశువైద్యాధికారి భానునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 600 కేజీలు అందుబాటులో ఉన్నాయని.. ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై అందజేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, పట్టాపాసుపుస్తకం జిరాక్స్ పత్రాలతో పశువైద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

బోనమెత్తిన చిన్నారులు



కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలో అరబిందో జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం పాఠశాలలోని ప్రీ ప్రైమరీ చిన్నారులు బోనాలతో సందడి చేశారు. చిన్నారులు సంప్రదాయ వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉత్సవాల విశిష్టతను పాఠశాల వ్యవస్థాపకులు సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, లలిత, శోభ, భార్గవి, సింధు, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి మొదటి నెల వేతనం



మొదటి నెల వేతనం అందజేస్తున్న ప్రభాత్ కిరణ్ కుటుంబ సభ్యులు

యాచారం: కొలువుల కల్పవల్లిగా విరాజిల్లుతున్న నందివనపర్తి జ్ఞాన సరస్వతి అమ్మవారికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. అమ్మవారి కృపతో ఉద్యోగాలు పొందుతున్న వారు తమ మొదటి నెల జీతాన్ని అమ్మవారి ఆలయాభివృద్ధికి అందజేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. శనివారం నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన చింతపల్లి మంజుల, రాంరెడ్డి దంపతుల కుమారుడు ప్రభాత్‌కిరణ్ ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రభాత్ కిరణ్ తన మొదటి నెల వేతనం రూ.68 వేలు ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డికి అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాత్ కిరణ్‌ను జ్ఞాన సరస్వతి సంస్థాన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సదా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... అమ్మవారి కృపతో ఎంతో మంది యువత ఉద్యోగాలు సాధించి తమ మొదటి నెల వేతానాన్ని ఆలయాభివృద్ధికి వితరణ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.

ధర్మన్నగూడెంలో సీపీఎం బృందం పర్యటన



సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

యాచారం: మండల పరిధిలోని ధర్మన్నగూడెంలో శనివారం సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా లేదని, వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారాయని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, బురద నీటితో దుర్వాసన వస్తోందని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు లేవని ప్రజలు సీపీఎం బృందం సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.అంజయ్య, శ్రీమన్నారాయణ, భాషయ్య, రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

గాంధీయిజం ఇంటర్నేషనల్
స్పీకర్ గాంధీ దర్శన్

షాబాద్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని గాంధీయిజం ఇంటర్నేషనల్ స్పీకర్ గాంధీ దర్శన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను గాంధీయిజం ఇంటర్నేషనల్ సెక్రటరీ ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లనపల్లి, సాధి ప్రాజెక్టు మినిస్ట్రీ ఆఫ్ ఇండియా కో–ఆర్డినేటర్, కాన్పూర్ ఐఐటీ ప్రొఫెసర్ ఇషాంత్ దూబే, పాఠశాల కరెస్పాండెంట్ సిద్దపురం ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ దర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంతో పాటు నైపుణ్యాభివృద్ధి బాటలో యువత ముందడుగు వేయాలన్నారు. ఆత్మ విశ్వాసంతో పాటు మారుతున్న ఆధునికతను అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఉపాధ్యాయులు, సఫియా, సమంతనాయక్, మధు, ప్రవళిక, సునీత, అనురాధ, ప్రవీణ్, రాజేందర్, శిల్పా, తహోర, ప్రభావతి, మాధవి, సునంత, సంతోష, అపర్ణ, అనుణ, పావని, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

హస్తినాపురం: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్‌కాంప్లెక్స్ ప్రాంతంలో వసీఐ తోట మహేశ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నాకాబందీ నిర్వహించారు. వర్షం ప్రభావం లేని ప్రాంతాలను ఎంచుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రజల సహకారంతో ఈ నాకాబందీ శాంతియుతంగా కొనసాగుతుందని, ప్రజల భద్రత కోసం అవసరమైతే రాబోయే రోజుల్లో ఇలాంటి తనిఖీలు కట్టుదిట్టంగా కొనసాగిస్తామని సీఐ తెలిపారు. 306 వాహనాలు తనిఖీ చేసి 25 వాహనాలకు రూ. 10 వేల జరిమానా విధించడం జరిగిందని, అనుమానిత వ్యక్తులను గుర్తించి వేలిముద్రలు సేకరించామన్నారు. తనిఖీల్లో క్రైమ్ సీఐ రాజేశ్, ఎస్సైలు, ఏఎస్సైలే, సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణే లక్ష్యం



నందివనపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో మొక్క నాటుతున్న అధికారులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అటవీ శాఖ అధికారులు కస్న నర్సింహ నాయక్, జంగారావు, మహేందర్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కృషి చేయాలని, మొక్కలు నాటే విషయంలో అందరి భాగస్వామ్యం ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈర్లపల్లి శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం వెంకటరామ శాస్త్రి, ఉపాధ్యాయులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డికి సన్మానం



వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: దేశంలోని డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను సమన్వయం చేసేందుకు, వారి పనితీరు, సంస్థాగత ప్రభావితత్వంపై వివరాల సేకరణకు ఇన్‌చార్జిగా నియమితులైన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచందర్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వంశీచంద్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌పై చర్యలకు ఫిర్యాదు



కేటీఆర్‌పై ఫిర్యాదు చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

షాబాద్: ఖమ్మం జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేటీఆర్‌పై పోలీస్‌స్టేషన్‌లో సీఐ కాంతారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి పేరుతో అప్పులు చేసిన రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తగిన రీతిలో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింలుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం



పులిమామిడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు బానూరి నరేందర్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, మొగుల రమేశ్, మంగలి మల్లయ్య, పాపగళ్ల రవీందర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పులిమామిడిలో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద వడ్డీలేని రుణాలు, ఉచిత గ్యాస్, విద్యుత్, రైతుభరోసా తదితర పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కూడా సునాయాసంగా చేసి చూపుతుండటం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, పాపగళ్ల యాదయ్య, భానూరి గంగాధర్‌రెడ్డి, వత్తుల నారాయణ, మహేందర్, శేఖర్, యాదయ్య, ప్రభుదాస్, గౌస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కందుకూరు: మానవాళి మనుగడకు చెట్లు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌శర్మ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని నేదునూరు పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్లు ప్రగతికి మెట్లు అని, నాటిన ప్రతీ మొక్కను ఉపాధ్యాయులు, విద్యార్థులు కాపాడుకోవాలన్నారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలతో మొక్కలు నాటించడం ఓ అలవాటుగా చేయాలన్నారు. పర్యావరణాన్ని సమతుల్యం చేయడంలో మొక్కలు ఎంతో కీలకమన్నారు. వీలున్న చోట మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌మోహన్‌రెడ్డి, శాంతకుమారి, కౌసల్య, శ్రీవాణి, గోరిజా, కరుణాకర్, పీడీ అబ్దుల్లా, డాక్టర్ ఎండీ బషీర్, హసునోద్దీన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

తుక్కుగూడ: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని శ్లోక ఇంటర్నేషల్ స్కూల్ సంస్థల చైర్మన్ బిట్లా శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం తుక్కుగూడ శ్లోక పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ వేడుకలు నిర్వహించి, విద్యార్థుల కౌన్సిల్‌ను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల డైరెక్టర్ చింతల మనీష్, ఉపాధ్యాయులు ఫాతిమా షబ్నం, అరుణ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఆ సంఘం సభ్యులు సందర్శించి సభ్యత్వాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను తట్టుకోవాలంటే ప్రతి 6 నెలలకు ఒక డీఏను ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి.. 19 నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల సమ్మె కాలపు వేతనాలను విడుదల చేయాలని, వాటిల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించి మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు మార్చాలని, విద్యార్థుల సంఖ్య మాత్రమే కాకుండా మీడియంను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనియెడల టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు కృష్ణయ్య, రంగరాజన్‌కుమార్, బాలయ్య, యాదయ్య, శివకుమార్, బుద్ధదేవ్, భరత్‌కుమార్, దత్తాత్రేయ, మహేష్, సమత, జ్యోతిర్మయి, కృష్ణవేణి, పరమేశ్వరి పాల్గొన్నారు.